
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 18 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (మంగళవారం సాయంత్రం)
సహర్ 5:02 (బుధవారం ఉదయం)



ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన వరి పొలం

దిగుబడిపై దిగులు..

- మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో తగ్గుతున్న నీటి మట్టం
- పడిపోయిన భూగర్భ జలాలు
- మళ్లీ బావుల పూడిక తీతలో రైతులు
- జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు
- వరి సాగు 1.78 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)
ఎన్నో ఆశలతో యాసంగి సాగు చేసిన రైతులను ఎండిపోతున్న పంటలు ఆవేదనను మిగిలిస్తున్నాయి. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా జిల్లాలో యాసంగి పంటలను బతికించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రోజురోజుకు భూగర్భ జలాలు పడి పోవడం, ప్రాజెక్ట్‌లలో నీటి మట్టాలు తగ్గిపోవడంతో రైతులు వరి పంటను దక్కించుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని పొలాలకు అందిస్తున్నారు. మరోవైపు బీటలు పారుతున్న పొలాలకు నీళ్లు అందించడానికి బోరుబావులు, వ్యవసాయబావుల్లో పూడిక తీత పనులు చేపడుతున్నారు. జిల్లాలో యాసంగిసాగు 1.82లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేసుకున్నారు. ఇందులో వరి 1.78 లక్షల ఎకరాలు, గోధుమ 109 ఎకరాలు, జొన్నలు 3.13 ఎకరాలు, మొక్క జొన్న 1975 ఎకరాలు, పెసర్లు 43.24 ఎకరాలు, కందులు 300.22 ఎకరాలు, పల్లి 26.2 ఎకరాలు, పొద్దుతిరుగుడు 350 ఎకరా ల వరకు వేసుకున్నారు. నీళ్లు లేకపోవడంతో పంటల పరిస్థితి అగమ్యగోచరంగానే మారింది.

9.28 మీటర్లకు పడిపోయిన జలాలు

జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. జనవరిలో 7.98మీటర్లకు భూగర్భ జలాలు పడిపోతే ఫిబవరిలో 9.28 మీటర్లకు పడిపోయింది. దీనికి తోడు ప్రాజెక్ట్‌లు కూడా వట్టిపోతున్నాయి. జిల్లాలో ప్రధానంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ సామర్థ్యం 27.55 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 12.123 టీఎంసీలకు పడిపోయింది.



ముస్తాబాద్‌లో మేతకు వదిలేసిన పొలం

అన్నపూర్ణ ప్రాజెక్ట్‌సామర్థ్యం 3.5 టీఎంసీలకు కాగా ప్రస్తుతం 1.35 టీఎంసీలు మాత్రమే నీటినిల్వ ఉంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ పరిధిలో బ్యాక్ వాటర్ తగ్గిపోవడంతో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో ప్రధానంగా రైతులు బోరుబావుల పైనే అధారపడ్డారు. సెస్ పరిధిలో 78,613 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు దాదాపు 20 నుంచి 30వేల రూపాయలు ఖర్చు చేస్తూ ..

మిగతా 8లో

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిన తీరు (మీటర్లలో)

మండలం	ఫిబ్రవరి 2024	ఫిబ్రవరి 2025	తగ్గుదల
బోయినపల్లి	6.57	7.21	- 0.64
చందుర్తి	5.48	5.23	- 0.25
గంభీరావుపేట	9.65	11.59	- 1.94
ఇల్లంతకుంట	8.58	5.90	2.68
కోనరావుపేట	9.87	9.72	0.16
ముస్తాబాద్	14.23	9.79	4.14
రుద్రంగి	6.09	6.73	- 0.64
సిరిసిల్ల	12.71	12.15	0.56
తంగళ్లపల్లి	10.92	7.87	3.04
వీర్నపల్లి	14.57	13.45	1.13
వేములవాడ రూరల్	5.85	4.77	1.09
వేములవాడ అర్బన్	13.58	13.18	1.40
ఎల్లారెడ్డిపేట	12.42	15.62	- 3.21
జిల్లా సరాసరి	**10.18**	**9.28**	**0.90**

జిల్లాలో యాసంగి సాగు (ఎకరాల్లో)

మండలం	మొత్తం సాగు	వరి
గంభీరావుపేట	18000	18000
ఇల్లంతకుంట	26374	24000
ముస్తాబాద్	20008	20000
సిరిసిల్ల	4803.5	4800
తంగళ్లపల్లి	19036	19000
వీర్నపల్లి	9100	9100
ఎల్లారెడ్డిపేట	16854	16850
బోయినపల్లి	13220	12500
చందుర్తి	16045	16000
కోనరావుపేట	17826.11	17800
రుద్రంగి	5333	4700
వేములవాడ	5187	5150
వేములవాడ రూరల్	10470	10450
మొత్తం	**182256.61**	**178350**

మండే ఎండ

- గంభీరావుపేటలో 40.5 డిగ్రీలు నమోదు



సిరిసిల్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎండలు వరుసగా దంచికొడుతు న్నాయి. మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతుండటంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 17.5 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలుగా నమోదైంది. గంభీరావుపేటలో గరిష్ట ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలు, వేములవాడ రూరల్‌లో 40.3, సిరిసిల్ల, చందుర్తి, ముస్తాబాద్ మండలాల్లో 40.2, రుద్రంగిలో 40.1, ఎల్లారెడ్డిపేటలో 40.0, వీర్నపల్లిలో 39.7, బోయినపల్లి, కోనరావుపేటలో 39.4, తంగళ్లపల్లిలో 39.1, ఇల్లంతకుంటలో 38.7, వేములవాడలో 37. 7 డిగ్రీలుగా నమోదైంది.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ మహేశ్. బి. గితే



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఎస్పీ మహేశ్. బి.గితే

సిరిసిల్ల క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ మహేశ్.బి. గితే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడానికి గ్రీవెన్స్ డే కొనసాగుతుందన్నారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుకు పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

ఫార్మసిస్ట్‌లకు శిక్షణ

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఐరన్ ఫోలిక్ ఆసిడ్ (ఐఎఫ్ఏ) మాత్రలు సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్‌లకు ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఐఎఫ్ఏ మాత్రలు సప్లయ్ చైన్ మేనేజ్మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ ఫార్మసిస్ట్‌లు నిబద్ధతతో పని చేయాలన్నారు. జిల్లాలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఐఎఫ్ఏ మందులను ఆన్‌లైన్‌లో ఎలా ఇండెంట్ చేయాలో ఫార్మసిస్ట్‌లకు వివరించారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ఐఎఫ్ఏ మందులు ఎంత మోతాదులో ఇవ్వాలో అవగాహన కల్పించారు. వివరాలను హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో పొందపరచాలని రిపోర్టులను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎంజిలా అల్ఫ్రెడ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు నయిమా జహా, సీహెచ్‌వో శాంత, హెచ్‌ఈ బాలయ్య, రాజ్‌కుమార్, సుదర్శన్ పాల్గొన్నారు.

రాజన్న కల్యాణం.. కమనీయం



వేములవాడలో రాజన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు నమిలికొండ ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం శ్రీస్వామి వార్లకు ప్రత్యేక పూజలతో పాటు ధ్వజా రోహణ ఘనంగా నిర్వహించారు.

అభిజిత్ లగ్న మూహుర్తమున ఉదయం 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు వేద మంత్రోచ్చరణలతో అత్యంత వైభవోపేతంగా స్వామి వారి దివ్యకల్యాణ తంతు జరిపించారు. భారీగా భక్తులు తరలివచ్చారు.

- వేములవాడ కల్చరల్

⇨ వివరాలు 7లో..

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



అర్చన, సక్కుబాయిని అభినందిస్తున్న కలెక్టర్, అధికారుల

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా పారా గేమ్స్‌కు ఎంపికైన జిల్లా మహిళలను సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించారు. ఈ నెల 20 నుంచి ఢిల్లీలో జరగనున్న ఖేలో ఇండియా పారా గేమ్స్‌కు సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన మిట్టపల్లి అర్చన ఎఫ్ 46, వీర్నపల్లి మండలం, గర్జనపల్లికి చెందిన భూక్య సక్కుబాయి ఎఫ్ 40 విభాగాలకు ఎంపికకాగా వారిని కలెక్టర్‌తో పాటు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అభినందించారు.

కొనసాగుతున్న రైతుల నిరసన దీక్ష




నిరసన దీక్షలో పాల్గొన్న మహిళా రైతులు

ఇల్లంతకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని మహిళా రైతులు చేపట్టిన నిరసనదీక్ష కొనసాగుతోంది. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో చేపట్టిన దీక్ష సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు వదిలిపెట్టి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అన్నారు. నిధులు కేటాయించి పనులు చేపడితే 9,500 ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళా రైతుల దీక్ష వద్ద కాంగ్రెస్‌పార్టీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి మాట్లాడుతూ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. అనంతరం బీజేపీ మండల శాఖల అధ్యక్షులు భూమల్ల అనీల్‌కుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావులు దీక్షకు సంఘీభావం ప్రకటించి, ఎండిన పంటలను పరిశీలించారు.

గురుకులాల్లో గీజర్లు ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సోలార్ గీజర్లను ఏర్పాటు చేయాలని వేములవాడ శాసన సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా సోమవారం గురుకులాల నిర్వహణపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆది శ్రీనివాస్ ఈ మేరకు ప్రభుత్వానికి సూచన చేశారు. విద్యార్థుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని వారికి వసతులు పెంచే విషయమై ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు వేకువజామున చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్ని హాస్టళ్లలో సోలార్ ఆధారిత గీజర్లను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని గురుకుల హాస్టళ్లలో ఇప్పటికే సోలార్ పవర్ ఆధారిత గీజర్లు ఉన్నప్పటికీ, చాలా స్కూళ్లలో ఈ సదుపాయం అందుబాటులో లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, అన్ని గురుకులాల్లో తక్షణమే గీజర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

24 నుంచి పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

- కలెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేత

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఈ నెల 24 నుంచి నిరమధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్ ప్రకటించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి సమ్మె నోటీసు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను ఇవ్వాలని కలెక్టర్‌ను అడిగితే రాజకీయాలు చేస్తున్నారని బెదిరిపులకు గురిచేయడం సరికాదన్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కార్మికులు ఈ నెల 23వ తేదీలోగా పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే 24వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మ్యాలాల నర్సయ్య, మండలాలకు చెందిన అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, అక్కల అంజయ్య, నారాపురం నర్సయ్య, న్యాత నర్సయ్య, ముదుగం అనిల్, సందెల మహేష్, రవి, వినీత్, గోవర్ధన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న జీపీ కార్మిక సంఘం నాయకులు

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

- ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె నరేందర్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నరేందర్ మాట్లాడారు. బీడీ కార్మికులకు కరువ భత్యం (వీడీఏ)సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు జరగాయన్నారు. 1994లో బీడీ కార్మిక సంఘాలకు బీడీ కంపనీల యజమానుల సంఘాల మధ్య చర్చలు జరగాయన్నారు. చర్చల్లో వెయ్యి బీడీలకు వినిమయ ధరల సూచీ ప్రకారం ప్రతి పాయింట్‌కు పది పైసల చొప్పున కరువు భత్యం చెల్లించాలని ఒప్పందం జరిగిందన్నారు. 2024 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు వినిమయ ధరల సూచిక ప్రకారం 1809 పాయింట్ల నుంచి 1913 పాయింట్లకు పెరిగిందన్నారు. అంటే 104 పాయింట్లు పెరగగా దాని ప్రకారం పాయింట్‌కు పది పైసలు చొప్పున కరువు భత్యం రూ. 10.40పైసలు పెరుగుతాయన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు. పెరిగిన కరువు భత్యం బోనస్ 8.33 శాతం, సంవత్సరకాలంలో సెలవులతో కూడిన వేతనం 5 శాతం, జాతీయ, పండుగుల సెలవులతో కూడిన వేతనం 2 శాతం రేటును కలుపుకొని వెయ్యి బీడీలకు మొత్తం కూలీ రేటు రూ. 261.97 పైసలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ ప్రకారం నెలసరి జీతాల ఉద్యోగులకు ప్రస్తుతం పెరిగిన కరవు భత్యం రూ. 10.40 పైసలు ప్రస్తుతం పొందుతున్న నెల జీతంపై రూ. 312 పెరుగుతుందన్నారు. అదే విధంగా బీడీ ప్యాకింగ్ చేసే ప్యాకర్లకు కరువు భత్యం ప్రతిరోజు చేస్తున్న బీడీ ప్యాకింగ్‌పై రూ. 10.40పైసలు పెరుగాలన్నారు. పెరిగిన కరువు భత్యం వివిధ రకాల బీడీ ప్యాకింగ్‌లు కలిగిన లక్ష బీడీ ప్యాకింగ్‌కు కరవు భత్యం పెరుగుదల ఎంత అనేది నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. పెరిగిన కరువు భత్యం రాష్ట్రంలో గల ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. బీడీ కార్మికులు, బీడీ ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులందరూ ఐక్యంగా పెరిగిన కరువు భత్యం అమలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం రాంప్రసాద్, నాయకులు గంగరాం, మల్లన్న కనకయ్య, కమలాకర్, రాధ, ఒగ్గులక్ష్మి, రాజక్క పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్

జలగంటకు వేళాయె..



- వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని నిపుణుల సూచన
- గతంలో పాఠశాలల్లో అమలు
- కరోనా తర్వాత ఆచరణకు నోచుకోని వైనం
- విద్యార్థుల్లో నీరు తగ్గితే ప్రమాదమని వైద్యుల హెచ్చరిక

వెల్గటూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతుండడంతో ఎండలు మండుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం చొరవ తీసుకొని పాఠశాలల్లో మళ్లీ జల గంట అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా కంటే ముందు 2018లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ గంటకు ఒకసారి జలగంట మోగించాలని నిర్ణయించింది. ప్రతీ పాఠశాలల్లో జలగంట అమలు చేయడంతో పిల్లల శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. కానీ కరోనా తరువాత జలగంట విషయం మరిచి పోయారు. దీనితో వేసవి కాలం వచ్చిందంటే విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.


పిల్లల్లో నీటి శాతం తగ్గితే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, సాధ్యమైనంత వరకు తగిన మోతాదులో పిల్లలకు నీటిని అందించాలని వైద్యులు పేర్కొంటున్నారు. కొంత మంది బాల బాలికలు నీరు తాగితే మూత్రం వస్తుందనే భయంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న నీటిని కూడా తాగడం లేదని తెలుస్తోంది. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు సరిగా లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పాషిగామ పాఠశాలలో అమలు

జలగంట ప్రాముఖ్యతను గుర్తించిన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాషిగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ పాఠశాలలో అమలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతీ గంటకు ఒకసారి చిన్నారులు నీటిని తాగేలా ఒక కాల పట్టికను తయారు చేసి గోడపై ప్రదర్శించారు. ఆ సమయం ప్రకారం విద్యా ర్థులు నీటిని తాగేలా చర్యలు చేపట్టారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని విద్యార్థులు గంటకు ఒకసారి నీరు తాగేలా చర్యలు చేపడితే వారి ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు.

జలగంట అమలు చేస్తే మేలు..

విద్యార్థులు తగినంత నీటిని తాగకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. బడి ఈడు పిల్లలు వారి వయసు, లింగం, బరువును బట్టి ప్రతీ రోజు ఒక లీటరు నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని తాగాలని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంలో, ఎలక్ట్రో లైట్లను సమతుల్యం చేయడంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. తగిన మోతాదులో ప్రతి నిత్యం నీటిని తాగడం వలన మెదడు పని తీరు కూడా బాగుంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అన్ని విద్యా సంస్థల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా, వడ దెబ్బకు గురి కాకుండా నివారించవచ్చు. రోజంతా కూర్చొని చదవడం కంటే కనీసం గంటకు ఒక సారి ఐదు నిమిషాలు నీటిని తాగడానికి కేటాయిస్తే బాగుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జలగంట మోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాషిగామ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమయ పట్టిక

నీరు తాగడం అలవాటుగా మారాలి



డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల

ప్రతీ ఒక్కరు రోజూ తగినంత నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా బడి ఈడు పిల్లలు నీటిని తాగడంలో అశ్రద్ధ వహిస్తారు. దీనితో వేసవి కాలం డీ హైడ్రేషన్ వలన చర్మం పొడిబారడం, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వారి వారి వయసు, బరువును బట్టి ఒకటి నుంచి 2.5 లీటర్ల వరకు నీటిని అందిం చేలా చూడాలి. పాఠశాలల్లో విద్యార్థులకు తగి నంత నీటిని అదించేలా చర్యలు చేపట్టాలి.

జల గంట అమలు చేస్తున్నాం



నీలం సంపత్ కుమార్, పాషిగామ స్కూల్ హెచ్‌ఎం

పాషిగామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రతీ గంటకు ఒకసారి నీటిని తాగేలా జల గంట అమలు చేస్తున్నాం. ఒక కాల పట్టికను ఏర్పాటు చేసి ఆ సమయం ప్రకారం విద్యార్థులు నీరు తాగేలా చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో జలగంట అమలు చేస్తే విద్యార్థుల ఆరోగ్యం కాపాడినట్లు అవుతుంది.

ప్రతి గంటకు నీరు తాగుతున్నాం



భవిష్య వర్మ, పాషిగామ పాఠశాల విద్యార్థిని

మా పాఠశాలలో ప్రతి గంటకు ఒకసారి జలగంట మోగిస్తారు. ఉపాధ్యాయులు కచ్చితంగా ప్రతి గంటకు నీరు తాగాలని మాకు సూచిస్తున్నారు. దీంతో అందరం విద్యార్థులం నీటిని తాగుతున్నాం.

ఏటీఎం కార్డ్ మార్చి రూ.40 వేలు చోరీ

జమ్మికుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి అపరిచిత వ్యక్తి రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్‌ఉద్యోగి సోమవారం ఉదయం ఎస్‌బీఐ ఏటీఎంకు డబ్బుల కోసం వెళ్లాడు. అప్పటికే ఓ అపరిచిత వ్యక్తి సదరు రిటైర్డ్ ఉద్యోగిని అనుసరిస్తున్నాడు. మొదట రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎం మిషన్‌లో కార్డు పెట్టగా టెక్నీకల్ ఎర్రర్ అని వచ్చింది. దీంతో వెనుకాల ఉన్న అపరిచిత వ్యక్తి తాను చూస్తానని ఏటీఎం కార్డు తీసుకున్నాడు. ఉద్యో గికార్డు తనదగ్గర పెట్టుకుని తన దగ్గర ఉన్న కార్డును మిషన్‌లో పెట్టాడు. సిక్రేట్ పిన్‌నంబరు ఎంటర్ చేయాలని ఉద్యోగికి సూచించాడు. పిన్ ఎంటర్ చేయగా రాంగ్‌పిన్ అని వచ్చింది. దీంతో అతను తర్వాత తీసుకుంటానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అపరిచిత వ్యక్తి తనదగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగి ఏటీఎంకార్డు పెట్టి అప్పటికే తెలుసుకున్న పిన్ నంబరు ఎంటర్‌చేసి రూ.10వేల చొప్పున నాలుగుసార్లు రూ.40వేల కాజేశాడు. సెల్‌ఫోన్‌కు డబ్బులు కట్ అవుతున్నట్లు మేసేజ్ రావడంతో సదరుఉద్యోగి వెంటనే బ్యాంకుకు వెళ్లి ఏటీఎం కార్డు బ్లాక్ చేయించాడు. అనంతరం పోలీస్‌లను ఆశ్రయించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్లాపూర్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులో ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని గోనెల రాజ్‌కుమార్(28) అనే యువకుడు సోమవారం మృతిచెందాడు. మెట్‌పల్లిసీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం మల్లాపూర్ మండలం రాఘవపేటలో బంధువుల ఇంట్లో శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ముత్యంపేట గ్రామ శివారులో చెట్టుకు వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా సోమవారం మృతిచెందాడు. మృతుడితండ్రి గోనెల రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు సీఐతెలిపారు. కాగా రాజ్‌కుమార్‌కు 18నెలల క్రితం వివాహం జరిగింది.

లారీ ఢీ కొని మహిళ మృతి

తిమ్మాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలో రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేదునూర్ గ్రామానికి లచ్చవ్వ(52) నల్లగొండ గ్రామంలో జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం ఆటోలో బయలుదేరింది. ఈ క్రమంలో రేణికుంట గ్రామం వద్ద ఆటోను ఆపి కొబ్బరికాయలను కొనేందుకు రోడ్డుకు అవతలివైపునకు వెళ్లింది. కొబ్బరికాయలు కొనుగోలు చేసిన లచ్చవ్వ ఆటో ఎక్కేందుకు వెళుతూ రోడ్డుదాటుతోంది. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదారాబాద్‌వైపు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన లారీ లచ్చవ్వను ఢీకొంది. ఈ సంఘటనలో లచ్చవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

లారీ, బైక్ ఢీ: యువకుడి మృతి

అంతర్గాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుందనపల్లి శివారు రాజీవ్ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో సోమవారం బైక్‌పై వెళ్తున్న బండి ప్రసాద్ అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన బండి ప్రసాద్(32) ఆర్‌జీ-1 ఏరియా జీడీకే 11ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై బీ పవర్‌హౌజ్ గడ్డ మీదుగా కుందనపల్లి ఐఓసీఎల్ ఏరియా వైపు వెళ్తుండగా ఎన్‌టీపీసీ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ వెంకటస్వామి శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం శవాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెప్టిక్‌ట్యాంక్‌లో పడి ఒకరి మృతి

రాయికల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో రాయికల్ పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన సిలివేరి కిరణ్ కుమార్ (54) ఇంట్లో నిర్మాణంలో ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం



రాజగంగు (ఫైల్)

కథలాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలకు చెందిన కాసారపు రాజగంగు (50) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం ఎదిగిన కొడుకు ఎలాంటి పని చేయకపోవడంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్థాపానికి గురై ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి బుచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



అనసూర్య (ఫైల్)

కోరుట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని తాండ్ర్యాల ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద కొద్దిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనసూర్య(55) అనేమహిళ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 1న కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన తోట సంధ్య, ఆమె అత్త అనసూర్య బ్యాంక్‌లో పని ముగించుకుని ఇంటికి వెళ్ళేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నారు. వీరిని బైక్‌తో వేములకుర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న లంక నరేశ్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో అత్తా, కోడళ్లకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనసూర్య మృతి చెందిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంచంద్రం తెలిపారు.

చోరీ అయిన ట్యాబ్‌ల రికవరీ

మానకొండూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14న రాత్రి 23ట్యాబ్‌లు దొంగతనానికి గురయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ కేసును చేధించారు. సీఐ లక్ష్మీనారాయణ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి పది రోజుల క్రితం ప్రార్థన సమయంలో హెచ్‌ఎం చూపించిన ట్యాబ్‌లను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. కాగా సదరు విద్యార్థి ఇంటికి వెళ్లతున్నానని చెప్పి అదే రోజు రాత్రి 23 ట్యాబ్‌లను దొంగిలించి మండలంలోని కొండపల్కల గ్రామంలోని రాముని గుట్టపై దాచిపెట్టాడు. ట్యాబ్‌లను రికవరీ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. 24గంటల్లో కేసు చేధించడంపై సీపీ గౌస్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాశ్ సీఐని అభినందించారు.



రికవరీ చేసిన ట్యాబ్‌లతో పోలీసులు

వీధి కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రాచర్ల అంజయ్యకు చెందిన గొర్రెల మందపై వీధి కుక్కలు సోమవారం ఉదయం దాడిచేయడంతో 16గొర్రెలు మృతిచెందగా మరో 8 గాయపడ్డాయి. దీంతో మూడులక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. మండల పశు వైద్యాధికారి మనీషాపటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ కాంతయ్య, పంచాయతీ కారోబార్ భూమేశ్వర్ పాల్గొన్నారు.



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి మనీషాపటేల్

సోషల్ మీడియాలో అశ్లీల పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అశ్లీల పోస్టు పెట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని త్రీటౌన్ పరిధిలోని ఒక వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో అశ్లీల పోస్టు పెట్టాడు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ సైబర్ టిప్‌లైన్ ద్వారా త్రీటౌన్ పోలీసులకు రిపోర్టు వచ్చింది. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల ఆస్తి నష్టం

మల్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన సట్ట లత అనే మహిళ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్‌తో రూ.3లక్షల నష్టం జరిగింది. ఇంట్లోని బంగారు నగలు, నగదుతో పాటు ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో బాధితులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు మధుసూదన్‌రెడ్డి, సంపత్ సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే ఇంట్లో గల ఫర్నిచర్, రెండు తులాల బంగారు నగలు కాలిపోయాయి.

ఆర్టీసీ బస్సులో నుంచి కిందపడిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థిని కిందపడిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనకం మేఘన సోమవారం కరీంనగర్‌లో పరీక్షకు హాజరై తిరిగి బస్సులో ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో ముత్తారం గ్రామంలోని మూలమలుపువద్దకు రాగానే డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో బస్సులోనుంచి ఆమె కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోఉన్న ప్యాసింజర్లను వేరేబస్సులో పంపంచి అదేబస్సులో మేఘనను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ శివారులో రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య మొలంగూర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొలంగూర్ పెట్రోల్ బంక్ ఎదురుగా డేనియల్ అనే వ్యక్తి దండు కొంరయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. అదే సమయంలో కరీంనగర్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ప్రమాదస్థలం వద్ద తన వాహనాన్ని ఆపి గాయపడిన వారిని పరామర్శించి, డానియల్‌ను తనవాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, కొంరయ్యను 108లోతరలించారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్రవాహనం: ఇద్దరికి గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలకేంద్రంలో ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువతులు గాయపడ్డారు. సిద్దిపేటజిల్లాకు చెందిన నీహారిక, రుచిత ద్విచక్రవాహనంపై వస్తూ తంగళ్లపల్లిలో ఆటోనుఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ సంఘనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో విద్యార్థినికి గాయాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుక్క కాటుతో విద్యార్థిని గాయపడింది. వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామానికి చెందిన గొట్టిముక్కల దేవరాజు, కృపారాణి దంపతుల కూతురు సువర్ణ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది.

సోమవారం సాయంత్రం బహిరార్భూమి కోసం పాఠశాల గది నుంచి బయటకు వచ్చి వెళ్లే సమయంలో అప్పటికే గురుకుల పాఠశాలలో ఉన్న కుక్కల గుంపు విద్యార్థినిపై దాడిచేసి గాయపరుస్తుండగా సువర్ణ అరుపులు విన్న విద్యార్థులు అక్కడికి చేరుకుని కుక్కలను చెదరగొట్టారు. కుక్కల దాడితో గాయపడ్డ సువర్ణను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులు, వాచ్‌మన్ నిర్లక్ష్యంవల్లే కుక్కలు పాఠశాలలోకి వచ్చి దాడి చేశాయని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుక్కలదాడిలో గాయపడ్డ సువర్ణను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండం అదిత్య, బీఎస్పీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

నత్తనడకన వాటర్ ట్యాంక్ పనులు





నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు, కొనుగోలు చేసి పక్కన పడవేసిన పైపులు

- అమృత్ పథకం కింద నిధులు మంజూరు
- గత ఏడాది ఆగస్టు 7న శంకుస్థాపన
- పిల్లర్ల దశలోనే పనులు
- ఈ యేడాదీ తప్పని తాగునీటి కష్టాలు

సుల్తానాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అమృత్ 0.2 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.18.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు భావించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఇబ్బందులను తొలగించేందుకు తొమ్మిది నెలల క్రితం నిర్మాణం చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు వేసవిలో ఈ ట్యాంక్ ద్వారా మెరుగైన నీటి సరఫరా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తానాబాద్, సుగ్గాంపల్లి, శ్రీరాములపల్లి, శాస్త్రీనగర్, పూసాల గ్రామాలు ఉన్నాయి. ఆయా విలీన గ్రామాలలో అప్పటి గ్రామ పంచాయతీకి సంబంధించిన మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు బిగించి సరఫరా చేస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు ఇటు మిషన్ భగీరథ పథకం నీళ్లుగానీ అటు మానేరు నీరు కానీ పూర్తి స్థాయిలో అందడం లేదు

రెండు రోజులకోసారి సరఫరా

సుల్తానాబాద్ పట్టణంలో ప్రస్తుతం రెండు రోజులకోసారి (డే బై డే) నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పాత కాలం నాటి పైపులైన్ల కారణంగా తరుచూ పైపులైన్లు దెబ్బతింటున్నాయి. సుల్తానాబాద్ పట్టణానికి తాగునీటి సరఫరా వ్యవస్థ ఉన్న గట్టేపల్లి మానేరులోని బావిలో పని చేస్తున్న మోటార్లు తరుచు కాలిపోతున్నాయి. ఈ కారణాలతో నీటి సరఫరాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డే బై డే కూడా నీరు రాని దుస్థితి ఎదురవుతుంది. కాలిపోయిన మోటార్లు, ధ్వంసమైన పైపులైన్ల మరమ్మతు చేయించడంలో ఆలస్యం అవుతున్నందున తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది.

తొమ్మిది నెలల క్రితం శంకుస్థాపన

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18.40కోట్ల నిధులతో 14 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను గతేడాది ఆగస్టు 7న ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభించారు. ట్యాంక్ పనులు పిల్లర్ల స్థాయిలో మాత్రమే ఉన్నాయి. పనులు వేగవంతం చేసి ట్యాంక్‌ను ఈ వేసవిలో ఉందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. రోజూ నీటి సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాంక్ పనులు అభివృద్ధిలో ఉన్నాయి



నియాజ్ మున్సిపల్ కమిషనర్

అమృత్ స్కీం ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు అభివృద్ధిలో ఉన్నాయి. వేసవికి ట్యాంక్ అందు బాటులోకి రాకపోవచ్చు. అయినా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంలో ఎలాంటి ఆటంకం లేకుండా చూ స్తున్నాం. అప్పుడప్పుడు పైప్‌లైన్ల మరమ్మతు వచ్చినా వెంటనే పూర్తి చేయిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సక్రమంగా నీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక పైప్‌లైన్ల కోసం కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. అవి టెండర్ల దశలో ఉన్నాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం.. రెండునెలల క్రితం 40మందిలబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చాయి. ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం నుంచి వినయ్ అనేవ్యక్తిద్వారా చెక్కు పంపించారు. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్ అనేవ్యక్తి రవి అనేలబ్ధిదారుని పేరుమీదవచ్చిన రూ.60 వేల చెక్కును వినయ్ దగ్గర నుంచి తీసుకున్నాడు. ఇదేగ్రామానికి చెందిన రవి అనే వ్యక్తినికలిసి అతని అకౌంట్‌లో వేశాడు. తమకు సంబంధించిన చెక్కు కాకపోయినప్పటికీ ఇద్దరు కలిసి డబ్బులు పంచుకున్నారు. విషయం వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యేక్యాంపు ఆఫీస్ పీఏ డోలిసాయికృష్ణ ఫిర్యాదు మేరకు డబ్బులను స్వాధీనం చేసుకొని సోమవారం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి జైలు

జగిత్యాలక్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరికి రెండు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పెల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పీట్ల సూరి, కొమిరి నరేష్ ఓబాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగికంగా వేధించారు. దీంతో బాలిక కుటుంబసభ్యులు 2020లో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో సూరి, నరేష్‌కు జైలు శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్‌లను ఎస్పీ అభినందించారు.

చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

డిప్యూటీ సీఎంకు సీఐటీయూ నాయకుల వినతి



ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చేనేత పవర్‌లూం రంగానికి రూ. 2 వేల కోట్లను కేటాయించి వాటిపై అధారపడి పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడం రమణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికు మార్‌లు కోరారు. హైదరాబాద్ లోని అసెంబ్లీలో సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పవర్‌లూం పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభం వల్ల రాష్ట్రంలో 15 నెలల కాలంలో సరైన ఉపాధి లేక దాదాపు 30 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే షెడ్‌లు పూర్తయిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని కోరారు. మరమగ్గాల కార్మికులకు 2023 సంవత్సరంలో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులు రూ.9 కోట్లు కార్మికులకు అందించాలని కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం తయారు చేయిస్తున్న పొదుపు సంఘాల మహిళలకు అందించే చీరల తయారీలో కార్మికులకు రోజుకు రూ. వెయ్యి వచ్చే విధంగా కూలీ నిర్ణయించాలని కోరారు. సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమలకు సంబంధించి సెస్ సంస్థ విధించిన బ్యాక్ బిల్లింగ్ అదనపు విద్యుత్ ఛార్జీలు రూ. 30 కోట్లను రద్దు చేయాలని కుటీర పరిశ్రమ అసాములకు 10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్ అందించాలని అదేవిధంగా టెక్స్‌టైల్ పార్కులో విద్యుత్ భారంగా మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలుచేపట్టడంతో పాటు 50 శాతం విద్యుత్ రాయితీ అందించి అన్ని రకాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.



వ్యవసాయంలో కృత్రిమ మేధ

- పంటల్లోచీడపీడల నివారణకు రైతులకు సలహాలు
- మొబైల్ యాప్‌ను రూపొందించిన ఐకార్

చొప్పదండి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలోకి ఏఐ టెక్నాలజీ వచ్చేసింది. మారుమూల ప్రాంతాల్లోని రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానం చేస్తు ఏఐ ఆదారిత యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో వివిధ రకాల తెగుళ్ల, చీడపీడలు పంటలకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయి. సాంప్రదాయకంగా ఈ ప్రమాదాలను నియంత్రించడానికి రైతులు విచ్చలవిడిగా రసాయనిక పురుగుమందులు ఉపయోగిస్తారు. విపరీతంగా పురుగు మందుల వాడకం వల్ల నష్టాలు ఉన్నాయి. జల, వాయు, భూ కాలుష్యం, పర్యావరణ అసమతుల్యం, జంతువుల్లో, పక్షుల్లో, మనుషుల్లో కలిగే అనారోగ్యాలు, చీడల్లో పురుగు మందుల నిరోధకత పెరుగుతుంది. చీడపీడలు, సమగ్ర పురుగు మందుల వాడకం గురించి రైతులకు సరైన సమాచారం లేకపోవడం వల్ల సస్య రక్షణ సమాచారం కోసం పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ, ఐకార్ (భారత వ్యవసాయ పరిశోదన సంస్థ) నేషనల్ ఫెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) అనే ఏఐ ఆధారిత మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను రూపొందించారు. ఆగస్టు 15, 2024న ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ యాప్‌ను ఆవిష్కరించగా గత డిసెంబరులో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. రైతుల పొలాల్లో చీడ పీడలను త్వరగా గుర్తించి వాటి నివారణకు సత్వర సలహాలు, సూచనలు అందించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వ బారత వ్యవసాయ శాఖ పరిధిలోని మొక్కల సంరక్షణ తనిఖీ, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో ఈ నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్ఎస్) ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

డౌన్‌లోడ్ ఇలా

ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రైతులు పంట పొలంలో వాడడానికి వీలుగా ఈ యాప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పనిచేస్తుంది. యాప్ ప్రస్తుతం ఆంగ్లం, హిందీ, మరాఠి భాషల్లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం యాప్‌లోని కొన్ని ఫీచర్లు రైతులు, అందుబాటులో ఉన్నాయి. చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, ప్రధాన పంటలకు సంబంధించిన కీటక వ్యాధులను సకాలంలో ఎదుర్కొనేందుకు రైతులు సరైన సలహాలు పొందవచ్చు.

చీడపీడల గుర్తింపు మాడ్యూల్...

ప్రస్తుతం తెగుళ్ల గుర్తింపు మాడ్యూల్ 61 ముఖ్యమైన పంటలకు సంబంధించిన వివిధ చీడపీడలు, తెగుళ్లను గుర్తించగలదు. ఈ మాడ్యూల్‌లో రైతులు నేరుగా మొబైల్ కెమెరా నుంచి ఫొటోను క్యాప్చర్ చేయవచ్చు లేదా ఫోన్ గ్యాలరీ నుంచి అప్‌లోడ్ చేయవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ అప్‌లోడ్ చేసిన ఫోటోలను విశ్లేషించి అందుబాటులో ఉన్న డేటాబేస్‌ను ఉపయోగించి తెగులును గుర్తించి, ఆ తెగులు వల్ల కలిగే లక్షణాలపై సమాచారాన్ని అందిస్తుంది. సమర్థవంతమైన తెగులు, చీడపీడల నియంత్రణ కోసం ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) పద్ధతులను ఇది సూచిస్తుంది.

మొబైల్ యాప్ విశేషాలు

ఎన్‌పీఎస్ఎస్ ఏఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా రైతులకు పంటల్లో చీడపీడల యాజమాన్యంపై పూర్తి సమాచారాన్ని శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తారు. ఈ యాప్‌లో పురుగుల ఫొటోలను, పంట ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. యాప్ చీడపీడలను, తెగుళ్లను గుర్తిస్తుంది. వెంటనే పిచికారి చేయాల్సిన మందుల వివరాలు, సూచనలు యాప్‌లో కనిపిస్తాయి.

15 రకాల పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, గోధుమ, యాపిల్, అరటి, వంగ, ద్రాక్ష, కంది, మినుము, దానిమ్మ, సోయాబీన్, చెరకు, టమాట పంటల్లో పురు గులు, తెగుళ్ల ఉధృతి సమాచారం రైతులు తెలుసుకోవచ్చు. పంటల్లో పురుగుల ఉధృతికి తగ్గట్టుగా చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫారసు చేస్తుంది.

ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ ద్వారా ఏ వ్యాధి, ఏ కీటకం హానికరం లేదా ప్రయోజనకరమైనది అని తెలుసుకోవచ్చు. దాని క్రిమిసంహారక మందులను, ఏ పరిమా ణంలో, ఏ సమయంలో, ఎంత వాడాలి అనే సమాచారాన్ని పొందవచ్చు. క్రిమిసంహారక మందుల కంటే ముందుగా సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతుల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ మొబైల్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, ఉద్యాన పంటల్లోని పురుగులు, తెగుళ్ల సమగ్ర సమాచారం అందుతుంది.



యాప్ లోగో

ఇంటి వద్దకు భద్రాద్రి రాముడి తలంబ్రాలు



కార్గో సిబ్బంది వద్ద భద్రాచలం తలంబ్రాల కోసం బుక్ చేసుకుంటున్న ఆర్ఎం రాజు

భగత్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాముడి తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ఇంటి వద్దకే చేర్చనున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు. సోమవారం కార్గో సిబ్బంది వద్ద భద్రాద్రి రాముడి తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా అక్కడకు వెళ్ల లేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో తలంబ్రాలను ఇంటి వద్దకు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకు ఒక్కో ప్యాకెట్‌కు 151 రూపాయలు ఆన్ లైన్‌లో లేదా బస్టాండ్ కార్గో సెంటర్లు, ఏజెంట్ కౌంటర్ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు.

తలంబ్రాల బుకింగ్ కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కరీంనగర్ ఆర్ఎంఈ	9154298581
కరీంనగర్	9154298562
గోదావరిఖని	9154298554
హుస్నాబాద్	9154298673
హుజూరాబాద్	9154298559
మంథని	9154298554
జగిత్యాల	7780250439
కోరుట్ల	9154298572
మెట్‌పల్లి	9154298574
సిరిసిల్ల	9154298576
వేములవాడ	9154298574



కల్యాణంలో త్రిశూలాలను చూపుతున్న శివపార్వతులు



కల్యాణం.. కమనీయం

- వేములవాడలో శివపార్వతుల కల్యాణం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం సతీమణి మంజుల
- తలాంబ్రాలు పోసుకున్న జోగినులు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాత మామిడి కింద కట్నాలు రాయంగా.. పూత మామిడి కింద పుస్తెలు కట్టంగా.. తల్లిమామిడి కింద తలువాలు పోయంగ.. అష్టాణ కంకణం, నొష్టాన బాసింగంతో.. పక్కన పార్వతి, నెత్తిన గంగమ్మ, రెక్కల శూలాలతో పెద్దలందరూ తరలివచ్చి వేములవాడ పార్వతిరాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం వైభవో పేతంగా, కన్నుల పండువగా నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుడు నమిలికొండ ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలతో పాటు ధ్వజారోహణ ఘనంగా నిర్వహించారు. వరుడు రాజరాజేశ్వర స్వామి, వధువు పార్వతీ దేవి అమ్మవారిని రాజన్న ఆలయం నుంచి మేళతాళాలతో ఆలయ గెస్ట్‌వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి తీసుకు వచ్చారు. వరుడు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి తరుపున పెళ్లి పెద్దగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, వధువు శ్రీపార్వతిదేవి అమ్మ వారి తరుపున ఆలయ అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. శివుడికి వరకట్నంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రూ. 551 కోట్లు చెల్లిస్తామని అన్నారు. కన్యాదాతలుగా ఈశ్వరగారి సురేష్- నాగలక్ష్మీ దంపతులు వ్యవహరించగా వేదపండితులు అభిజిత్‌లగ్న మూహూర్తమున ఉదయం 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు వేద మంత్రోచ్చరణలతో అత్యంత వైభవో పేతంగా శ్రీస్వామి వారి దివ్యకల్యాణ తంతు జరిపించారు.



పార్వతిపరమేశ్వరులకు తలంబ్రాలు పోస్తున్న కన్యాదాతలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రముఖులు

కల్యాణానికి రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, రాజన్న ఆలయం తరఫున ఈవో వినోద్‌రెడ్డి, వేములవాడ మున్సిపల్ తరపున కమిషనర్ అన్వేష్‌లు పట్టు వస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ కార్యలయం నుంచి కమిషనర్‌తో పాటు ఉద్యోగులు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా రాజన్న ఆలయం వరకు తరలివచ్చారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పట్టువస్త్రాలు తలంబ్రాలు తీసుకువచ్చి రూ. 11వేల 121 కట్నంగా చదివించారు.

60 వేలకు పైగా తరలివచ్చిన భక్తజనం

ఆది దంపతుల దివ్య కల్యాణమహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి భక్తులు వేములవాడకు తరలవచ్చి ఆలయ వసతి గదులతో పాటుగా ఆలయ పరిసరాల్లోని ఖాళీస్థలాల్లో విడిది చేశారు. తెల్లవారు జామునే శ్రీస్వామి వారి కల్యాణం తిలకించేందుకు ఆలయానికి తరలిరావడంతో ఆలయ ఆవరణ, ప్రాంగాణం ఓం నమఃశివాయ స్మరణతో మారుమోగిపోయింది. రాజన్న ఆలయ ప్రధాన ద్వారం ముందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పట్టణ పురవీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. సుమారుగా 60 వేలకు పైగా భక్తులు రాజన్న ఆలయానికి తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు.

రాజన్నను మనువాడిన జోగినులు

దక్షిణకాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజన్న కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జోగినులు రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి కల్యాణానికి వచ్చిన ట్రాన్స్‌జెండర్లు, జోగినీలు, శివపార్వతులు తోటి వారికి పుస్తెలు కట్టి తలంబ్రాలు పోసుకుంటూ సాక్షాత్తు పరమ శివుడిని మనువాడినట్లు స్మరించుకున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్ భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్వామి కల్యాణాన్ని నిర్వ హించారు. పెళ్లి పెద్దలుగా ఒడ్నాల శంకరయ్య-సుగుణ, దాసి రవీందర్-జయశ్రీ దంపతులు కల్యాణం జరిపించారు.



తలంబ్రాలు పోసుకుంటున్న జోగినులు

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులోని వేములవాడ అనుబంధ దత్తత ఆలయమైన స్వయంభు నాగ లింగేశ్వర స్వామి ఆల యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



మొక్కులు చెల్లించుకుటున్న భక్తురాలు



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం సతీమణి మంజుల, భక్తులకు అన్నదానం, ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో వినోద్‌రెడ్డి

వైభవంగా స్వామి వారి పెద్ద సేవ



నెమలివాహనంపై స్వామి వారల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పెద్ద సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. కల్యాణం అనంతరం రాత్రి 7 గంటల సమయం లో శ్రీస్వామి వారలను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలోని జంగమయ్యలు ఆది దంపతుల కల్యాణాన్ని పురష్కరించుకుని వీర భద్రుడి పాటలు పాడుతూ శరభ గజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నెమలి వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ కంబల వెంకటన్న ఉన్నారు.

లక్ష్మీ నృసింహుడి దిగ్యాత్ర



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను పురవీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకు వెళ్లి పూజలు చేశారు. రాత్రి స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య, నరసింహ మూర్తి, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి రూ.2, 96,630 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.1,23,014, ప్రసాదాలు విక్రయించగా రూ.1, 42,400 లభించాయి. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ.31,216 ఉన్నట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారల దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి 8 గంటలకు డోపోత్సవం (డోపుకథ) ఉంటుంది. శేషప్ప కళావేదికపై మధ్యాహ్నం తెలంగాణ సాంస్కృతిక సారథులచే జానపద, భక్తి, సంగీతం, నృత్యాలు, గడ్డం రమేష్‌చే భక్తి సంగీతం, రాత్రి 7 గంటల నుంచి కరీంనగర్‌కు చెందిన శశికళ బృందంచే భక్తి సంగీతం ఉంటుంది. అనంతరం ఆలయ అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్‌చే డోపుకథ ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

రెండో రోజు కొనసాగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

సెమిఫైనల్స్‌కు చేరుకున్న కరీంనగర్, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జట్లు

హుజూరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలు సోమవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కరీంనగర్ వర్సెస్ మెదక్, హైదరాబాద్ వర్సెస్ నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం 7గంటలకు సెమీ ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, సీనియర్ క్రీడాకారులు పవన్‌కుమార్, శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, సురేష్, తిరుపతి, రవికుమార్, శ్యాంసుందర్, సజ్జు, సాయికృష్ణ, రాజేష్, విక్రమ్, సాంబ, కరీంనగర్ జిల్లా జట్టు కోచ్ రాజేష్, మేనేజర్ వినయ్ పాల్గొన్నారు.

- **మ్యాచ్‌ల వివరాలు..**

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ గ్రూప్-ఏలో ఖమ్మంపై వరంగల్ 9-1, రంగారెడ్డిపై హైదరాబాద్ 4-3, వరంగల్‌పై కరీంనగర్ 1-0, ఖమ్మంపై రంగారెడ్డి 1-0విజయం సాధించాయి. గ్రూప్-బీలో నల్గొండపై మహబూబ్‌నగర్ 16-2, ఆదిలాబాద్‌పై నిజామాబాద్ 2-0, మెదక్‌పై మహబూబ్‌నగర్ 3-1, నల్గొండపై నిజామాబాద్ 12-2, ఆదిలాబాద్‌పై మెదక్ తలపడగా చెరొక రెండు గోల్స్ వేసి డ్రాగా ముగిసింది.

పాడి రైతులకు ప్రోత్సాహకం అందించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందించి ఆదుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలంలోని పాడి రైతులు కోరారు. సోమవారం సిరిసిల్లలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నామని రైతులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పాడి పశువుల పెంపకం చేపట్టి కరీంనగర్, విజయ పాల కేంద్రాలకు పాలను విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. లీటరుకు రూ.5 చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించిన సర్కారు నేటికి అందించలేదని వాపోయారు. ఇప్పటికైనా అందించి ఆదుకోవాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండేలా వెంకటాపూర్‌లో గత 10 ఏళ్ల కిందట విజయ పాల శీతలీకరణ కేంద్రంలో చేపట్టిన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయని అన్నారు. పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. రైతులు భాస్కర్, లక్ష్మణ్, పర్శరాంరెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

ఇల్లంతకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎన్‌ఎస్‌యుఐ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాలో సీఎంను దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఐ మండల అధ్యక్షుడు జెట్టి యశ్వంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు మచ్చ కుమార్, మూడపల్లి వంశీ, సాయివర్మ తదితరులు ఉన్నారు..

'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ

● సమస్యలు సత్వరమే పరిష్కరించాలి ● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు తరలి రావడంతో కిటకిటలాడిపోయింది. సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 113దరఖాస్తులు, ఫిర్యాదులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 49, సిరిసిల్ల మున్సిపాల్టీకి 11, ఉపాధి కల్పన శాఖకు 6, జిల్లా సంక్షేమశాఖకు 5, విద్యాశాఖకు 4, భూముల కొలతల శాఖకు 3, చందుర్తి ఎంపీడీవోకు 3, ఎస్టీసీకి 3, నీటిపారుదలశాఖకు 2, వేములవాడ మున్సిపాల్టీకి 2, సెస్‌కు 2, కార్మిక శాఖకు1, ఇంటర్మీడియేట్ శాఖకు1, రిజిస్ట్రేషన్‌కు 1, అటవీశాఖకు1, ఎస్పీ కార్యాలయానికి 1, ఎస్సీ కార్పోరేషన్‌కు 1, ముస్తాబాద్ ఎంపీడీవోకు1, కోనరావుపేట ఎంపీడీవోకు1, గిరిజన అభివృద్ధి శాఖ 1, జిల్లా వైద్యాధికారికి 1, డీపీఆర్ఈకి 1, చేనేత జౌళీశాఖకు1, జిల్లా పంచాయతీ శాఖకు1, దేవాదాయశాఖకు1, ఎక్సైజ్ శాఖకు1 చొప్పున వచ్చిన అర్జీలను స్వీకరించారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

గడువు ముగిసినా చెత్త ట్రాక్టర్ డ్రైవర్‌లను కొనసాగిస్తున్నారు

- తాళ్ళపల్లి నాగరాజు,వేములవాడ

వేములవాడ మున్సిపాల్టీలో చెత్తను సేకరించే ట్రాక్టర్‌లకు సంవత్సరం పాటు తాత్కాలిక డ్రైవర్ల కోసం టెండర్‌లను 2020 సంవత్సరంలో ప్రకటించి 15 మంది ట్రాక్టర్ డ్రైవర్‌లను తాత్కాలికంగా సంవత్సరం పాటు పనిచేసేందుకు తీసుకుని గడువు ముగిసి ఐదు సంవత్సరాలు గడిచినా వారినే కొనసాగిస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకుండా పోయింది. గడువు ముగిసినా మున్సిపల్ అధికారులు టెండర్‌లు వేయడం లేదు, దీనిపై కలెక్టర్ స్పందించి వారి స్థానంలో మరి కొందరికి స్థానం కల్పించాలి.

పట్టా పాస్‌బుక్కులను నిలిపివేయాలి

- పోగుల శ్రీనివాస్, పాజుల్‌నగర్

వేములవాడ రూరల్ మండలంలోని పాజుల్ నగర్ గ్రామంలో సర్వేనంబర్‌లో 73లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టాపాస్ బుక్కులను ఇవ్వకుండా నిలిపివేయించాలి. గ్రామంలో ఉన్న భూమిని గ్రామానికి చెందిన వారు కబ్జాచేసి అన్యాయం చేస్తుండడంతో కోర్టును ఆశ్రయించాను. కోర్టులో విచారణ కొనసా గుతుండగా రెవెన్యూ అధికారులు కోర్టు ఆదేశాలను దిక్కరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించాలి.

కబ్జాచేసిన నాభూమిని ఇప్పించండి

-యెల్లండి కనుకయ్య, ప్రగతినగర్, సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణ శివారులోని ముష్టిపల్లి శివారులో సర్వేనంబర్‌లోని 51/40లో ఉన్న 22గుంట ప్రభుత్వ భూమిని 1980 సంవత్సరంలో అప్పటి వేములవాడ తహసీల్దార్ పట్టా సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమి చుట్టూ కందకం తీసి పంటలను సాగుచేసుకుంటూ జీవిస్తున్నాను. స్థలాన్ని సిరిసిల్ల పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సిరిసిల్ల సాయిబాబా ఆలయంలో ఉద్యోగులు విధులను నిర్వర్తించడంలేదు

- సాగాల జీవన్, సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణంలో దేవదాయ శాఖ అధీనంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి. ఆలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి విధులకు హాజరుకావడం లేదు. దీనిపై కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన భాధితులు

సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లోని రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించడంతో ఇళ్లలోని వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీకి చెందిన వారు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. న్యాయం చేయాలని కోరారు.

● సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కోసం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయం ఖాళీగా ఉందని దానిని నిరుపేద కార్మికుల అవసరాల కోసం వినియోగించాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కో- కన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

దిగుబడిపై దిగులు

(5వ పేజీ తరువాయి)


ఎల్లారెడ్డిపేటలో వ్యవసాయ బావిలో పూడిక తీత

బావుల్లో పూడిక తీయిస్తున్నారు. మరికొందరు రైతులు కొత్తగా బోరు బావులు వేసుకుంటున్నారు.

దిగుబడిపై ప్రభావం

వర్షాలు సమృద్ధిగా కురవడం, ప్రాజెక్టులలో నీళ్ల చేరడంతో రైతులు యాసంగి సాగుకు ఇబ్బంది ఉండదని వరి సాగువైపు మొగ్గు చూపారు. ప్రధాన పంటగా 1.78 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ సారి ఫిబ్రవరి నుంచే భూగర్భ జలాలు పడిపోవడంతో యాసంగి ధాన్యం దిగుబడిపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. యాసంగి సాగు ఆశలు ఆవిరై పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సాగు వరికి చివరికి నీటి గండంతో కన్నీటి కష్టాలు రైతులకు మిగిల్చిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు

- పొన్నవేణి దేవయ్య, రైతు



వెంకటాపూర్ గ్రామ శివారులోని నాకున్న రెండున్నర ఎకరాల్లో వ్యవసాయ బావి ద్వారా గత 15 ఏళ్లుగా వరి పంటను సాగు చేస్తున్నాను. 22 గజాల బావిలో ఉన్న నీళ్లతోనే వరి పంటను వేశాను. నీళ్లు అడుగంటడంతో రూ.26 వేలు వెచ్చించి పూడిక తీత పనులు చేయిస్తున్నాను. ఎండిపోయే పొలాన్ని దక్కించుకునేందుకే తండ్లాడు తున్నా. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

పంటలు ఎండిపోయాయి.

- గాదె ఘధు, రైతు పెద్దలింగాపూర్



ఐదెకరాల్లో వరి సాగు చేశాను. నీరు లేక పంట ఎండిపోయింది. ధాన్యం దిగుబడి వస్తుందనే నమ్మకం పోయింది. కాళేశ్వరం ప్యాకేజీ 11లో కెనాల్ కాలువ వస్తే పంటల నష్టం ఉండేది కాదు. నిర్మాణం పూర్తి చేస్తే ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలంలో 9,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

విద్యార్థినిపై కుక్కల దాడి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిన్నబోనాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై కుక్కలు దాడి చేయడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలేసిన ప్రభుత్వం గురుకులాలపై దృష్టిపెట్టాలని అన్నారు. విద్యాశాఖకు బాధ్యత వహిస్తున్న సీఎం ఈ ఘటనపై స్పందించాలన్నారు. కేసీఆర్ గారి పాలనలో చదువుల కేంద్రాలుగా ఉన్న గురుకులాలు కాంగ్రెస్ పాలనలో చావుకేకలు పెడుతున్నాయన్నారు. రేవంత్ ప్రభుత్వ నిలువెత్తు నిర్లక్ష్యానికి ఈ ఘటన నిదర్శనమన్నారు.

కన్నుల పండువగా మల్లికార్జున స్వామి కల్యాణం

సిరిసిల్ల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఎద్దుగుట్ట మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం పెద్దూర్, బోనాల, చిన్నబోనాల గ్రామాల్లోని యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సాగుతోంది. పెద్దూర్ శివారులోని ఎద్దుగుట్ట మల్లన్న ఆలయంలో నాగవెల్లి పట్నం వేసి మల్లన్న కల్యాణం ఒగ్గు కళాకారులు ఘనంగా చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్‌లు లింగంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

వేములవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, రాజు, రవీందర్, సలాం, హమీద్, కోటేశ్వర్, బాలచందర్, జ్యోతి, శిరోమణి, స్వరూప, శ్రీలత విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాధికారికి ఘన సన్మానం

ఇల్లంతకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారిగా పనిచేసి బదిలీ అయిన బన్నాజీని ఎమ్మార్సీ భవనంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, లక్ష్మీనారాయణ, తిరుపతి, గోవర్ధన్, రాణిలతో పాటు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సమస్యకు స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు ఫోన్ ద్వారా సమస్యను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలియజేయగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులను గ్రామానికి పంపించారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో నీటి ఎద్దడి నెలకొందని గ్రామస్థులు ఫోన్ ద్వారా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తెలియజేయగా అధికారులను ఆదేశించి సమస్య పరిష్కరించాలని తెలపడంతో అధికారులు గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలని విద్యార్థుల ర్యాలీ

చందుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ అకాడమిక్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగొండ సత్యనారాయణ, భారతి ఎయిర్ టెల్ ఫౌండేషన్ అకాడమిక్ మెంటర్ పోతుగంటి ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు జరగాయి. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ప్రారంభించారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో విజేతలైన బాలబాలికలు, యువతీ యువకులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ మెడల్స్, సర్టిఫికెట్ల ప్రధానం చేసి అభినందించారు. ఈ నెల 23న హైదారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కన్కం శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఇల్లంతకుంట, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఖోఖో పోల్స్‌ను యువజన నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అందిం చారు. విద్యార్థుల క్రీడల్లో రాణించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సానబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు

విద్యార్థులకు జ్యూట్ బ్యాగుల పంపిణీ

తంగళ్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివరిస్తూ జూట్ బ్యాగులను అందించారు. పాఠశాల హెచ్ఎం జోగినిపల్లి అనురాధ చొరవతో ప్లాస్టిక్ వాడకం వల్ల అనార్థలను వివరిస్తూ.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని జనపనారతో తయారు చేసిన బ్యాగులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, శారద, రమేశ్, శైలజ, శిరీష, పద్మ, రవీందర్‌రెడ్డి, సమత, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో అలసత్వం తగదు

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
● వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

వేములవాడటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పేషెంట్లకు వైద్యం అందించడంలో అలసత్వం ప్రదర్శించవద్దని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని అన్ని విభాగాలను రోగులకు అందుతున్న సేవల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలోని ప్రతీ విభాగాన్ని కలియ తిరిగి వైద్యులు,సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరుని పర్యవేక్షించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. రిజిస్టర్లు, ఔట్ పేషెంట్, ఐపి వార్డు, పిడియాట్రిక్ వార్డు, ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ, డయాలసిస్ విభాగాలను పరిశీలించి రోగులను మీ సమస్య ఏమిటని? ఎక్కడి నుంచి వచ్చారు? ఏ విధంగా వైద్యసేవలు అందిస్తున్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవన నమూనాలో పేర్కొన్న విధంగా వార్డులు, గదులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సంబంధిత ఉద్యోగులకు, సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులు ఉన్నారు.


వేములవాడ ఏరియా ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కలెక్టర్

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణం చేనేత చౌక్ వద్ద సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. నిన్నటిరోజు సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టి బొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్‌గౌడ్, గాజుల మహేష్, మట్టి తిరుపతి, అడిచర్ల సాయి, శ్రీరామ్, వంశీకృష్ణ, అజయ్, గంగరాం ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ చిత్ర పటాలకు బీఆర్ఎస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. శాసనసభలో ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, జబ్బార్, హసన్, కిషన్, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సీత్యానాయక్, తిరుపతినాయక్, నర్సింలు, సురేశ్, ప్రభునాయక్, శివరామకృష్ణ పాల్గొన్నారు.


సిరిసిల్లలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేటలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దిష్టిబొమ్మలను దహనం చేసిన కాంగ్రెస్ నాయకుల చర్యలను ఖండిస్తూ కేసీఆర్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు కోడి అంతయ్య, పడిగెల రాజు, పడిగెల మానస, పుసపెల్లి సరస్వతి, అంకారపు రవీందర్, వలకొండ వేణుగోపాల్‌రావ్, కర్కబోయిన కుంటయ్య, నవీన్‌రావ్ ఉన్నారు.

గంభీరావుపేట : రాష్ట్రాన్ని పాలించడం చేతగాక ప్రతిపక్షాలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నేతలు దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి చిట్టంపల్లి భిక్షపతి, నిమ్మ శ్రీకాంత్, అర్జున్, శంకర్ ఉన్నారు.

వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీవర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని రాష్ట్ర నాయకుల అవునూరి ప్రభాకర్ ప్రకటించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారంతో ఎనమిదవ రోజుకు చేరుకున్న సందర్భంగా రగుడు జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి డప్పు చప్పళ్లతో ర్యాలీగా దీక్ష శిబిరానికి చేరుకున్నారు. దీక్షలోజిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, జిల్లా కో-కన్వీనర్ సావనపెల్లి రాకేష్, దోబ్బల ఆనంద్, సావనపెల్లి బాలయ్య, గుండు ప్రేమ్‌కు మార్, మాల్యాల శ్రీనివాస్, కత్తరపాక సంతోష్, మంగళి చంద్రమౌళి, సిరిసిల్ల రాజనర్సు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద డప్పులతో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

● చందుర్తి: ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తర్రి శంకరయ్య అన్నారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 7వరోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవునూరి రాజు, దావ నర్సయ్య, కొమ్ము పోచయ్య, గస్కంటి రాములు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: ఎస్సీవర్గీకరణ అనంతరమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసనదీక్ష కొనసాగుతోంది. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మంద రాజుమాదిగ, నాయకులు బట్టు శ్రీనివాస్, సావనపెల్లి శంకర్, పట్నం మహేందర్, కాసుపాక సురేష్, బొడ్డు వెంకటేశం పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం మూడవ రోజుకు చేరుకుంది. వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చేంతవరకు పోటీ పరీక్ష ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శరవింద్, భగవంతం, నర్సయ్య ,దేవయ్య, కనకరాజు, తిరుపతి, లింగం, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శివ కళ్యాణం

చందుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో పురాతనమైన శైవ క్షేత్రంగా విరజిల్లుతున్న రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివ కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితులు కొమ్మలపల్లి సంపత్ కుమార్ శర్మ, పోరండ్ల అనిల్ శర్మ, వంశాపర్య అర్చకులు తమ్మల భద్రయ్యశర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై కళా ప్రదర్శన

రుద్రంగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు కళా బృందం కళా ప్రదర్శన ఇచ్చారు. ఎండ తీవ్రత, పరిసరాల పరిశుభ్రత, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రదర్శన చేపట్టారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన

ఇల్లంతకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని రాష్ట్రకమిటీ సభ్యుడు జగన్‌మోహన్ పరిశీలించారు. ప్రిన్సిపాల్ గంగాధర్, సీఆర్పీ నర్సయ్యలతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన

తంగళ్లపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనితలు సందర్శించారు. జిల్లెల్ల గ్రామంలో చేపడుతున్న సర్వేను అకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ చంద్రికతో పాటు దేవిసింగ్, సత్యనారయణ, రాజేందర్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చందుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గ్రామ యువకుడు కుమ్మరి దయాకర్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. నాయకులు కటకం చంద్రయ్య, ఏనుగుల లచ్చిరెడ్డి, కటకం మల్లేశం, బింగి స్వామి, తీపిరెడ్డి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రాన్ని యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ప్రారంభించారు. బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి యేటా చలివేద్రం ఏర్పాటు చేస్తారు.

ఫేర్‌వెల్ హంగామా

గంభీరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, హెచ్ఎం గంగరాం, పాఠశాల చైర్మెన్ సుభద్ర పాల్గొన్నారు.

● కోనరావుపేట : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ మురళినాయక్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం బావుసాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సందర్భంగా మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం, బొప్ప దేవయ్య పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

వేములవాడ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ ప్రాతీయ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. నరాల శేఖర్, నీలం శేఖర్, నిమ్మశెట్టి విజయ్ ఉన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కోడగంటి శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చెర్మెన్ కంటెరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.